
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి

5 సిద్దిపేట
బుధవారం 4 డిసెంబరు 2024


రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ మనుచౌదరి

భూ నిర్వాసితులకు న్యాయం చేస్తాం

● కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేట కలెక్టరేట్, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి) : జిల్లా అభివృద్ధి కోసం రీజనల్ రోడ్డు వెళ్తున్నందున భూములు ఇవ్వడానికి రైతులు ఒప్పుకోవడం శుభపరిణామం అని కలెక్టర్ మనుచౌదరి అన్నారు. జిల్లాలో రీజనల్ రింగ్‌రోడ్డులో భూములు కోల్పోతున్న ఆయా గ్రామాల రైతులతో మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని కాన్ఫరెన్స్‌హాల్‌లో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. భూమే ఆధారంగా, వ్యవసాయమే బతుకుదెరువుగా జీవనం సాగిస్తున్నామని రైతులు కలెక్టర్‌కు విన్నవించారు. రీజనల్ రింగ్ రోడ్డు కోసం భూములు తీసుకోవడం అత్యంత బాధాకరమని వారు వాపోయారు. బహిరంగ మార్కెట్‌లో ప్రస్తుతం ఉన్న ధరను ఆయా గ్రామాల వారీగా రైతులు కలెక్టర్‌కు వివరించారు. ఆ మొత్తంలో నష్టపరిహారం లేదా ల్యాండ్ పూలింగ్‌లో మాదిరి అక్కడే రోడ్డు వెంబడి కొంత స్థలమైనా ఇప్పించాలని వారు కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. ఆయా గ్రామాల్లో భూమి విలువను నమోదు చేసుకున్నామని, రాష్ట్రస్థాయి అధికారులకు పంపించి అందరికీ న్యాయం చేయడానికి తన వంతు సహకారం అందిస్తానన్నారు. అలాగే ల్యాండ్ పూలింగ్ విషయమై అధికారులతో చర్చిస్తానని కలెక్టర్ తెలిపారు.


సిద్ది పేటలో నిర్వహించిన పరుగుపందెంలో పాల్గొన్న విద్యార్థులు, యువత, మున్సిపల్ సిబ్బంది

మహిళా సంఘాలకు రుణాల పంపిణీ

సిద్దిపేట టౌన్, డిసెంబరు3 (ఆంధ్రజ్యోతి) : ప్రజాపాలన దినోత్సవాల వేడుకల్లో భాగంగా సిద్దిపేట పట్టణంలో మంగళవారం మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్ పలు కార్యక్రమాలను నిర్వహించారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకు పరుగు పందెం పోటీలను ప్రారంభించారు. ఇందులో విద్యార్థులు, యువత, మార్నింగ్ వాకర్స్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు. పారిశుధ్య కార్మికులకు, విద్యుత్ నీటి సరఫరా లైన్‌మన్‌లకు, సిబ్బందికి ఎల్వీప్రసాద్ కంటి ఆసుపత్రిలో ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. పలు ప్రాంతాల్లో ఉన్న చెత్తకుప్పలను తొలగించి, రంగురంగుల ముగ్గులను వేసి మొక్కలను నాటిన ఆరుగురు పారిశుధ్య కార్మికులను సన్మానించారు. అలాగే పలు మెప్మా మహిళా సంఘాలకు బ్యాంకు రుణాలు, వీధి వ్యాపారులకు రుణాలు, దివ్యాంగులకు రుణాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హేమలత, మున్సిపల్ అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


చిన్నకోడూరు మండలం పెద్దకోడూరు కొనుగోలు కేంద్రంలో ధాన్యం కుప్పల పై కప్పి ఉంచిన టార్పాలిన్ కవర్లు

వణికిస్తున్న వరుణుడు

● తుఫాన్ ప్రభావం జిల్లాలో చిరుజల్లులు
● కలవరపడుతున్న అన్నదాతలు


తడిసిన ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతు



సిద్దిపేట కలెక్టరేట్/చిన్నకోదూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) ఫెంగల్ తుఫాన్ ప్రభావం వల్ల ఎప్పుడు వర్షం కురుస్తుందోనని జిల్లా రైతులు భయపడుతున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన వరి ధాన్యాన్ని రైతులు కొనుగోలు కేంద్రాలు, కల్లాలకు తరలించారు. తుఫాన్ వల్ల మూడురోజులుగా ఆకాశంలో మేఘాలు కమ్ముకున్నాయి. సిద్దిపేట జిల్లాలో సోమవారం సాయంత్రం, మంగళవారం తెల్లవారుజామున పలుచోట్ల చిరుజల్లులు కురిశాయి. కొంత మేర ధాన్యం తడిసింది. చిరుజల్లులు కురుస్తుండటంతో రైతులు కలవరపడుతున్నారు. తుఫాను వల్ల రైతులకు కంటి మీద కునుకు లేకుండాపోయింది. కొనుగోలు కేంద్రాల్లో, కల్లాల్లో ధాన్యం కుప్పలను కాపాడుకునేందుకు అన్నదాతలు ఉరుకులు, పరుగులు పెట్టాల్సి వచ్చింది. ఇంకా అక్కడక్కడ కోతకు వచ్చిన వరి చేలు ఉండటంతో వర్షాలకు పంట చేతికందుతుందో లేదోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.


సిద్దిపేటలో మార్కెట్ యార్డులో టార్పాలిన్ కవరుపై నిలిచిన వర్షం నీటిని తొలగిస్తున్న రైతులు

2 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

వర్షాకాలం సీజన్‌లో జిల్లాలో 3.68 లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు. 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుందని అధికారులు అంచనా వేశారు. ఈ ధాన్యాన్ని కొనుగోలు చేసేందు జిల్లావ్యాప్తంగా 419 కొనుగోలు కేంద్రాలను జిల్లా అధికార యంత్రాంగం ఏర్పాటు చేసింది. ఇప్పటి వరకు 2లక్షలమెట్రిక్ టన్నుల దొడ్డు ధాన్యాన్ని, 2,329 మెట్రిక్ టన్నుల సన్న ధాన్యాన్ని కొనుగోలు చేశారు. మొన్నటివరకు వాతావరణం ప్రశాంతంగా ఉండగా శనివారం నుంచి తుఫాను ప్రభావంతో మబ్బులు కమ్ముకున్నాయి. రైతులు ధాన్యాన్ని

మిగతా 8వ పేజీలో...

చేర్యాలలో తెలంగాణ మెడికల్ కౌన్సిల్ తనిఖీలు


క్లినిక్‌లో తనిఖీ చేస్తున్న మెడికల్ కౌన్సిల్ ఎథిక్స్ కమిటీ సభ్యుడు బండారి రాజ్‌కుమార్

చేర్యాల, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రథమ చికిత్స మాటున నకిలీ వైద్యులు పరిమితికి మించి వైద్యం చేస్తూ అధిక మోతాదు కలిగిన స్టెరాయిడ్స్ వినియోగిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారన్న ఆరోపణల మేరకు తెలంగాణ మెడికల్ కౌన్సిల్ ప్రతినిధులు స్పందించారు. మెడికల్ కౌన్సిల్ ఎథిక్స్ కమిటీ సభ్యుడు బండారి రాజ్‌కుమార్ నేతృత్వంలోని యాంటీక్వేకరీ బృందం మంగళవారం చేర్యాల, మద్దూరు మండలాల్లోని పలు క్లినిక్‌లతో పాటు ఆస్పత్రులను తనిఖీ చేశారు. పట్టణంలో రామచంద్రం, భాస్కర్, మద్దూరులో శ్రీశైలం క్లినిక్స్‌లో సోదాలు జరిపి ఎలాంటి అనుమతులూ పొందకుండా యాంటీబయాటిక్స్ స్టెరాయిడ్స్ అందిస్తున్నారని గుర్తించారు. వీరిపై ఎస్ఎంసీ చట్టం 34, 54ప్రకారం కేసు నమోదు చేయనున్నామని తెలిపారు. అక్షర, వెంకటసాయి ఆస్పత్రులను సందర్శించి కౌన్సిల్ రిజిస్ట్రేషన్ పొందిన క్వాలిఫైడ్ వైద్యులతో వైద్య సేవలు అందించాలని సూచించారు. మెడికల్ కౌన్సిల్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తప్పవన్నారు. సోదాల్లో హెచ్‌ఆర్‌డీఏ జనరల్ సెక్రటరీ గౌత్ పాల్గొన్నారు.


అక్కన్నపేట రైల్వేస్టేషన్ వద్ద మాట్లాడుతున్న డివిజనల్ రైల్వే మేనేజర్ లోకేష్ విష్ణోయ్

మేడ్చల్ టు ముత్కేడ్ రూ.2,300 కోట్లతో డబుల్ లైన్

● మనోహరాబాద్-కొత్తపల్లి మధ్య విద్యుత్ లైన్
● స్టేషన్లలో అధునాతన సౌకర్యాలు
● అక్కన్నపేట రైల్వేస్టేషన్‌ను తనిఖీ చేసిన డివిజనల్ రైల్వే మేనేజర్ లోకేష్ విష్ణోయ్

7


దివ్యాంగులను సన్మానిస్తున్న అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్

అంగవైకల్యం శరీరానికి మీ మనసుకు కాదు

● అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్

సిద్దిపేట కలెక్టరేట్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): అంగవైకల్యం మీ శరీరానికి కానీ మీ మనసుల కు కాదని, ధృఢమైన మనసు, మంచి విద్యతో ఏదైనా సాధించవచ్చని అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా సంక్షేమ అధికారి శారదా ఆధ్వర్యంలోఅంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా అదనపు కలెక్టర్ హాజరయ్యారు. జిల్లాస్థాయిలో నిర్వహించిన దివ్యాంగుల క్రీడా పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు ఆయన అందజేశారు. విశిష్ట సేవలందించిన దివ్యాంగులను ఆయన సన్మానించారు.

మల్లన్న ఆలయ పాలకమండలి నియామకం

● ఎనిమిది మంది సభ్యులతో పాటు ఎక్స్‌అఫీషియో మెంబర్‌గా అర్చకుడు
● ఏడాది పదవీకాలంతో రెగ్యులర్ కమిటీ
● మరికొంతమంది నియామకానికి అదనపు నోటిఫికేషన్
● రెండు జీవోల విడుదలతో అయోమయం !



చేర్యాల, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మల్లికార్జునస్వామి దేవాలయ ధర్మకర్తల మండలి నియామకం కోసం ఎన్నో ఆశలతో ఎదురు చూస్తున్న నేపథ్యంలో మంగళవారం సాయంత్రం దేవాదాయశాఖ ఉన్నతాధికారులు విడుదల చేసిన జీవోలు కొంతమేర అయోమయానికి గురిచేయడం చర్చనీయాంశంగా మారింది. ఈ మేరకు జీవో ఆర్‌టీ నెం 463 ప్రకారం ఎనిమిది మందితో పాటు ఎక్స్ అఫీషియో సభ్యుడిగా ఆలయ అర్చకుడిని నియమిస్తున్నట్లు పేర్కొనగా, జీవో ఆర్‌టీ నెం. 464 ప్రకారం ధర్మకర్తల మండలి నియామకానికి దరఖాస్తులు చేసుకోవాలని సూచించడంతో సందేహాలు నెలకొన్నాయి. గతేడాది స్వామివారి కల్యాణానికి ముందు ప్రభుత్వం అధికారంలోకి రావడం, నోటిఫికేసన్ విడుదలకు అవకాశం లేకపోవడంతో తాత్కాలికంగా ఉత్సవ కమిటీని నియమించారు. గత ఏప్రిల్ నెలలో ఆ కమిటీ పదవీ కాలం ముగిసింది. తదనంతరం రెగ్యులర్‌కమిటీ నియామకం కోసం పార్లమెంటు ఎన్నికల ముందు నోటిఫికేషన్, తరువాత రీ-నోటిఫికేషన్ జారీ చేయడంతో 80కి పైగా దరఖాస్తులు వచ్చాయి. ఈ విషయమై నేరచరిత్ర కలిగిన వారి వివరాల సేకరణకు ఇంటెలిజెన్స్ వర్గాల ద్వారా విచారణ చేపట్టారు. అయితే, ఈనెల 29న మల్లన్న కల్యాణం జరగనుండటంతో 14 మందితో కూడిన రెగ్యులర్ కమిటీ నియమించేందుకు ప్రక్రియ చేపట్టినా, మంగళవారం ఎనిమిది మందిలో కమిటీని నియమిస్తూ చర్యలు తీసుకున్నారు.

చిగిరి కొమురయ్య, కాయిత మోహన్ రెడ్డి, లింగంపల్లి శ్రీనివాస్, అల్లం శ్రీనివాస్, వల్లాద్రి అంజిరెడ్డి, మామిడాల లక్ష్మి, నేరెల్లపల్లి మహేందర్‌రెడ్డి, కొప్పురపు జయ ప్రకాశ్‌రెడ్డితో పాటు ఆలయ ప్రధాన అర్చకుడు మహదేవుని మల్లికార్జున్‌ను నియమించారు.

మిగతావారికోసం 20 రోజుల్లోగా దరఖాస్తుల ఆహ్వానం

పాలకమండలిని 14మందితో నియమిస్తారు. అధికారపార్టీ శ్రేణులు, ఆలయాభివృద్ధికి పాటుపడుతున్న దాతలకు అవకాశం కల్పిస్తారు. కానీ ప్రస్తుతం ఆలయ కమిటీలో నేరచరితతో పాటు ఎలాంటి వివాదాలకు తావులేని కేవలం ఎనిమిది మందికి అవకాశం కల్పించారు. పూర్తిస్థాయి కమిటీ నియామకం కోసం అదనపు దరఖాస్తుల స్వీకరణకు చర్యలు తీసుకున్నారు. ఆశావహులు మంగళవారం నుంచి 20 రోజులలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ విషయమై పూర్తిస్థాయి వివరాలు తెలపకపోవడంతో భక్తులతో పాటు కాంగ్రెస్‌కేడర్‌ను అయోమయంలో పడేసింది. కల్యాణానికి మరో మూడువారాలపై గడువు ఉండటం, అదనపు సభ్యుల నియామకానికి 20 రోజులే ఉన్నందున కమిటీలో ఎవరికి స్థానం కల్పించనున్నారన్న విషయం ఆసక్తికరంగా మారింది.

ఖాకీ.. పెద్దరాయుళ్లు

● పోలీస్‌స్టేషన్లలోనే పంచాయితీలు
● ఆ తర్వాత వాటాల పంపకాలు!
● డబ్బు, పలుకుబడి ఉన్న వారికే లబ్ధి
● అన్యాయానికి గురవుతున్న సామాన్య ప్రజలు



సిద్దిపేట క్రైం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రజల, ధన, మాన ప్రాణాలు రక్షించేవారు పోలీసులు. ఆపద వచ్చినా, అన్యాయం జరిగినా నేరుగా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేస్తే న్యాయం జరుగుతుందని ప్రజలు నమ్ముతారు. కానీ సిద్దిపేట జిల్లాలో అలాంటి పరిస్థితి కనపడడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం భూముల ధరలు అధికంగా ఉండడంతో ఎక్కడ చూసినా భూతగాదాలు ఏర్పడుతున్నాయి. ఇదే అదునుగా భావించిన పోలీసులు భూతగాదాల్లో జోక్యం చేసుకుని సెటిల్‌మెంట్లు చేస్తున్నారు. జిల్లాలో 27 పోలీస్‌స్టేషన్లు ఉన్నాయి. ప్రతి పోలీస్ స్టేషన్‌లో ప్రతిరోజు మూడు నుంచి నాలుగు భూపంచాయితీలు జరుగుతున్నాయి. ఇరువర్గాల వారు గొడవలు పడి పోలీస్‌స్టేషన్‌లో ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకుంటున్నారు. ఈ క్రమంలో ఇరువర్గాలను కూర్చోబెట్టి పోలీసులే సెటిల్‌మెంట్ చేస్తున్నారు. అనంతరం వారి నుంచి కొంత వాటా తీసుకుంటున్నట్లు సమాచారం. అయితే కొన్నిసార్లు బాధితుల వైపు న్యాయం ఉన్నప్పటికీ ఎదుటివారు డబ్బు, పరపతి ఉన్నవారైతే పోలీసులు అటువైపే మొగ్గుచూపుతున్నారన్న ఆరోపణలూ లేకపోలేదు. కొన్ని కేసుల విషయాల్లో కనీసం ఫిర్యాదు కూడా తీసుకోవడం లేదు. ఒక్కోసారి బాధితులు చేసేదేమీ లేక తమ వైపు తప్పు లేకున్నా పోలీసుల భయానికి కాంప్రమైజ్ అవుతున్నారు. ఆ తర్వాత రాజీపడినట్లు చెప్పి కేసు వాపసు తీసుకుంటున్నారు. ఇలాంటి సంఘటనలు ప్రతి పోలీస్‌స్టేషన్‌లో ఏదో ఒకచోట జరుగుతూనే ఉన్నాయి. ఒక్క భూ తగాదాలే కాదు రోడ్డు ప్రమాదాల కేసులు, హత్యాయత్నం కేసులు, ఆత్మహత్య కేసులు, అనుమానాస్పద కేసులు, చీటింగ్ కేసులు, కుటుంబ తగాదాలు, అన్ని విషయాల్లో బాధితులు పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేస్తే అపోజిషన్ వారితో మాట్లాడుకోమని పోలీసులే సలహాలిస్తున్నారు. కేసు పెడి తే మీకే ఇబ్బందులని, పోలీస్‌స్టేషన్‌కు, కోర్టుల వెంబడి తిరగాల్సి ఉంటుందని ఇప్పుడే కాంప్రమైజ్ అయితే ఎలాంటి ఇబ్బంది ఉండదని సూచిస్తున్నారు. దాంతో బాధితులు వెనుకడుగు వేస్తున్నారు

పైసలిస్తేనే పని!

పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన ప్రతీ కేసు విషయంలో పోలీసులకు ముడుపులు ఇవ్వాల్సి ఉంటుంది. చివరకు డ్రంకెన్ డ్రైవ్‌లో, రోడ్డు ప్రమాదాల కేసుల్లో, కార్డెన్ సెర్చ్‌లో, ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘించిన కేసుల్లో, సీజ్ చేసిన వాహనాలను బాధితులు తీసుకోవాలన్నా కూడా సంబంధిత పోలీసులకు ఎంతో కొంత ముట్టజెప్పాల్సిందే. ఒక్కోసారి కేసును బట్టి ముడుపులు అడుగుతున్నారు. పెద్ద కేసు చేసే విషయంలో బాధితులకు తెలియకుండా చిన్న కేసు చేసి అపోజిషన్ వారి దగ్గర పోలీస్ అధికారులు డబ్బు దండుకొంటున్నారు. చివరకు స్టేషన్ బెయిల్ ఇవ్వాలన్న పోలీసులకు ముడుపులు చెల్లించాల్సిందే. ఉన్నత అధికారులు ఇలాంటి పోలీస్ అధికారులపై చర్యలు తీసుకొని సామాన్యులకు న్యాయం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

సెల్‌టవర్ బ్యాటరీ దొంగల అరెస్ట్

● 23 బ్యాటరీలు, ఫోన్లు, వాహనాలు, నగదు స్వాధీనం



7

నత్తనడకన హైలెవల్ బ్రిడ్జి పనులు

● రెండేళ్లు గడుస్తున్నా పూర్తి కాని వైనం
● ఇబ్బందులు పడుతున్న వాహనదారులు



8

ఒకే నంబరుతో రెండు వాహనాలు!

● సంగారెడ్డి జిల్లాలో యథేచ్ఛగా ఇతర రాష్ట్రాల వాహనాల మాయ
● ఒకే నంబరుతో తిరుగుతున్నా పట్టించుకోని ఆర్టీఏ అధికారులు



7

హై వోల్టేజ్‌తో గృహోపకరణాలు దగ్ధం

శివ్వంపేట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ హై వోల్టేజ్ సప్లై కావడంతో పలు ఇళ్లలో టీవీలు, ఫ్రిజ్జులు కాలిపోయిన సంఘటన మంగళవారం గోమారంలో చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల మేరకు మండల పరిధిలోని గోమారం గ్రామంలో ఉదయం హై వోల్టేజ్ విద్యుత్ సరఫరా కావడంతో పెద్దపట్లోరి చంద్రారెడ్డి, పంది ముక్కుల నర్సింలు గౌడ్, లత నర్సింగరావు, పి. వెంకట్ రెడ్డి ఇళ్లతో పాటు మరికొందరి ఇళ్లల్లో ఫ్రిడ్జ్ పాడైపోయాయని బాధితులు తెలిపారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

● 11 మందిపై కేసు.. రూ.1.04 నగదు స్వాధీనం

జగదేవ్‌పూర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్, జగదేవ్‌పూర్ పోలీసులు దాడి చేసి 11 మందిపై కేసు నమోదు చేసినట్లు జగదేవ్‌పూర్ ఎస్‌ఐ చంద్రమోహన్ తెలిపారు. జగదేవ్‌పూర్ మండల పరిధిలోని గొల్లపల్లి గ్రామ సమీపంలో పేకాట ఆడుతున్నారని నమ్మదగిన సమాచారం మేరకు సోమవారం జిల్లా టాస్క్ ఫోర్స్ అధికారులు, జగదేవ్‌పూర్ ఎస్‌ఐ చంద్రమోహన్ సిబ్బందితో కలిసి పేకాట స్థావరంపై దాడి చేశారు. మొత్తం 11 మంది ఉండగా ఎనిమిది మందిని అదుపులోకి తీసుకోగా, మరో ముగ్గురు పరారీలో ఉన్నట్లు తెలిపారు. వారి నుంచి 1.04 లక్షల నగదు, తొమ్మిది సెల్‌ఫోన్‌లు, రెండు కార్లు, బైక్ స్వాధీనం చేసుకున్నామని ఎస్సై చంద్రమోహన్ తెలిపారు.













విద్యావ్యవస్థను గాలికొదిలేసిన ప్రభుత్వం

● బీఆర్‌ఎస్వీ నాయకులు

చేర్యాల, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): విద్యావ్యవస్థను ప్రభుత్వం గాలికొదిలేసిందని, గురుకుల పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్లల్లో సమస్యలు విలయతాండవం చేస్తున్నా పట్టించుకోకపోవడం తగదని బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జింకల పర్వతాలుయాదవ్ ఆరోపించారు. కొమురవెల్లి గ్రామశివారులోని కస్తూర్బా పాఠశాలను మంగళవారం బీఆర్‌ఎస్వీ బృందం సభ్యులు సందర్శించి విద్యార్థుల సమస్యలు అడిగితెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజాపాలన చేస్తున్నామని గొప్పలు చెబుతున్న సీఎం రేవంత్‌రెడ్డి విద్యాశాఖకు మంత్రిని నియమించకపోవడం విద్యావ్యవస్థపై ఉన్న అవగాహనకు నిదర్శనమన్నారు.

● బెజ్జంకి: సమస్యలకు నిలయంగా సంక్షేమ హాస్టళ్లు మారాయని, సంక్షేమ హాస్టళ్లపై సర్కారు చిన్నచూపు చూస్తుందని బీఆర్‌ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల హరిబాబు అన్నారు. బీఆర్‌ఎస్వీ ఆధ్వర్యంలో చేపట్టిన గురుకుల బాట కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల, కేజీబీవీ బీఆర్‌ఎస్వీ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి హరిబాబు మాట్లాడుతూ.. ప్రభుత్వం గురుకుల సంక్షేమ హాస్టళ్లను పట్టించుకోకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్వీ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు బిగ్గల్లా దుర్గసుదర్శన్, సదిగౌడ్, హరీశ్ వర్మ, భూపతి రాజు, సురేష్ పాల్గొన్నారు.


చేర్యాల: విద్యార్థుల సమస్యలు తెలుసుకుంటున్న బీఆర్‌ఎస్వీ నాయకులు

మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాల తనిఖీ

సిద్దిపేట కల్చరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేటలోని మైనార్టీ బాలికల రెసిడెన్షియల్ పాఠశాల, జూనియర్ కళాశాలను అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ మంగళవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్‌లోని భోజనశాలను పరిశీలించారు. వసతులు, సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు.


విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న అదనపు కలెక్టర్ చేస్తున్న అబ్దుల్ హమీద్

● చేర్యాల: చేర్యాల పట్టణంలోని కస్తూర్బా పాఠశాల, మండలంలోని ముస్త్యాల ఆదర్శ పాఠశాలతో పాటు భవిత సెంటర్‌ను సిద్దిపేట జిల్లా విద్యాశాఖాధికారి శ్రీనివాస్‌రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన తయారీకి వినియోగించే కూరగాయలు, నిత్యావసర సరుకులు, బియ్యం నాణ్యతను పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం భవిత సెంటర్‌ను సందర్శించి అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన క్రీడల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎంఈవో కిష్టయ్య సిబ్బంది పాల్గొన్నారు.

పెండింగ్ సమస్యలను పరిష్కరించండి

● సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశావర్కర్ల ఆందోళన


జహీరాబాద్: క్లస్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న ఆశావర్కర్లు

జహీరాబాద్/మునిపల్లి/మనూరు/శివ్వంపేట, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఆశావర్కర్లు గతంలో సర్వేచేసిన పెండింగ్ డబ్బులను వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా నాయకులు మైపాల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు జహీరాబాద్ పట్టణంలోని క్లస్టర్ కార్యాలయం ఎదుట ఆశార్కర్లు తమ డిమాండ్ల సాధన కోసం మంగళవారం ఆందోళన చేపట్టారు. ఆశావర్కర్లకు పనిభారం మోపడం సరికాదన్నారు. అనంతరం సీహెచ్‌వో రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. మునిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆసుపత్రి ఎదుట ఆశావర్కర్లు నిర్వహించిన నిరసన కార్యక్రమంలో సీఐటీయూ సంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ ఆశావర్కర్లకు రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు చెప్పిన కనీస వేతనం రూ.18వేలు తక్షణమే అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆశావర్కర్ల బకాయిపడిన పెండింగ్ డబ్బును వెంటనే చెల్లించాలని మనూర్ పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్‌కు సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశావర్కర్లు వినతిపత్రం అందజేశారు. మెదక్ జిల్లా శివ్వంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పీహెచ్‌ఎస్‌ఎం మల్లీశ్వరికి వినతి పత్రం అందజేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహేందర్ మాట్లాడుతూ పెండింగ్ డబ్బులను చెల్లించిన తర్వాతే కొత్త సర్వే చేపట్టాలన్నారు.

కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగడుతాం

● బీజేపీ జిల్లా అధ్యక్షులు గడ్డంశ్రీనివాస్

నర్సాపూర్/ జిన్నారం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పాలనలో వైఫల్యాలను గ్రామగ్రామాన ఎండగడుతామని బీజేపీ జిల్లా అధ్యక్షులు గడ్డంశ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం నర్సాపూర్‌లో బీజేపీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించిన అనంతరం సాయికృష్ణగార్డెన్‌లో నియోజకవర్గ స్థాయి సమావేశం రాష్ట్ర నిర్వహించారు. సమావేశంలో గడ్డంశ్రీనివాస్ మాట్లాడుతూ అమలు కాని హామీలను ఇచ్చి వాటిని నెరవేర్చకుండా కాలం వెళ్లదీస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను గ్రామగ్రామాన ఎండగడుతూ వచ్చే స్థానిక ఎన్నికలలో ఆ పార్టీకి తగిన గుణపాఠం చెప్పి బీజేపీ సత్తా చాటుతామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళీధర్‌యాదవ్‌తో పాటుజిల్లా ప్రధాన కార్యదర్శి రాజేందర్, అసెంబ్లీ కన్వీనర్ రమణారావు, నాయకులు పాల్గొన్నారు. అదేవిధంగా జిన్నారంలో రాష్ట్ర ప్రభుత్వ ఏడాది పాలన వైఫల్యాలపై బీజేపీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. పార్టీ మండల, జిల్లా నాయకులు జగన్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, నర్సింగ్‌రావు, రాజిరెడ్డిల ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. గ్యారంటీల అమలు, ప్రభుత్వ పథకాల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యం చెందిందని అన్నారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించి, పేదలకు ఇంటి స్థలాల పట్టాలు అందజేయాలని బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో ఆందోళన జరిపారు.


నర్సాపూర్‌లో బైక్‌ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

పాముకాటుతో మహిళ మృతి

సిద్దిపేట క్రైం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : పాముకాటుతో మహిళ మృతి చెందిన సంఘటన సిద్దిపేట పట్టణంలోనీ నర్సాపూర్ లో మంగళవారం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం నర్సాపూర్ కాలనీకి చెందిన న్యాయని బాలమణి (42) సోమవారం మధ్యాహ్నం ఇంటిముందు నిద్రపోయింది. ఈ క్రమంలో పక్కన ఉన్న చెట్ల పొదల నుండి పాము వచ్చి కాటేసింది. కుటుంబ సభ్యులు బాలమణి ఎంత లేపిన లేవకపోవడంతో పాము కరిచిందని గుర్తించి వెంటనే సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సాయంత్రం మృతి చెందింది. మృతురాలి భర్త యాదగిరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

● కిసాన్ సంఘ్ డివిజన్ ఇన్‌చార్జి కవ్వ వేణుగోపాల్‌రెడ్డి

హుస్నాబాద్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కిసాన్ సంఘ్ డివిజన్ ఇన్‌చార్జి కవ్వ వేణుగోపాల్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని మార్కెట్ యార్డులో తడిసిన ధాన్యాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. అధికారులు కొనుగోళ్లలో జాప్యం చేస్తున్నారని ఆరోపించారు.

సీఎం కప్ పోటీలకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి

మద్దూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సీఎం కప్ పోటీలకు ఆసక్తి గల యువత సెక్రటరీల వద్ద రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సి ఉంటుందని మండల ప్రత్యేకాధికారి రాధిక తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల స్థాయిలో పంచాయతీ సెక్రటరీలతో నిర్వహించిన కో ఆర్డినేషన్ సమావేశంలో ఆమె మాట్లాడారు. అండర్ 14 అండర్ 18తో పాటు 18 సంవత్సరాలు పైబడిన వారు గ్రామ స్థాయిలో ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ఈ నెల 7, 8 తేదిల్లో గ్రామస్థాయిలో కబడ్డీ, వాలీబాల్, ఖోఖో పోటీలను నిర్వహిస్తారని, గెలుపొందిన వారికి మండల స్థాయిలో ఈ నెల 10, 11, 12 వ తేదిల్లో నిర్వహిస్తారని తెలిపారు. మండల స్థాయిలో గెలుపొందిన వారిని జిల్లా స్థాయికి పంపిస్తారని వీరు జిల్లాస్థాయిలో 16 నుంచి 21 వరకు పాల్గొనాల్సి ఉంటుందన్నారు.

క్రైం కార్నర్

అప్పుల బాధతో కార్మికుడి ఆత్మహత్య


వెంకటయ్య(ఫైల్)

దుబ్బాక, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): అప్పులబాధ తాళలేక భవన నిర్మాణ కార్మికుడు ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు ఇలా ఉన్నాయి. దుబ్బాక పట్టణానికి చెందిన బండి వెంకటయ్య(65) కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో రూ.5లక్షల వరకు అప్పులు చేశాడు. వీటిని ఎలా తీర్చాలో తెలియక మంగళవారం ఇంటి వద్ద రేకుల షెడ్డులోని ఇనుపపైపునకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. మృతుడికి ముగ్గురు కూతుర్లు, కొడుకు ఉన్నారు.

సిద్దిపేటలో మరొకరు..


శంకర్(ఫైల్)

సిద్దిపేట క్రైం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేట పట్టణంలోని శ్రీనగర్ కాలనీకి చెందిన మోతుకు శంకర్ (30) ఎలక్ట్రిషన్ కూలీగా జీవనం సాగిస్తున్నాడు. కుటుంబ పోషణ కోసం అప్పులు చేశాడు. వీటిని ఎలా తీర్చాలో తెలియక సోమవారం రాత్రి ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న వన్ టౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హత్యకు గురైన మహిళ వివరాలు లభ్యం


లలిత (ఫైల్)

హత్నూర, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): హత్నూర మండల పరిధిలోని నస్తీపూర్ గ్రామ శివరులో ఈ నెల 1న హత్యకు గురైన మహిళ వివరాలను పోలీసులు గుర్తించారు. మృతురాలు పుల్కల్ మండలం బస్వాపూర్ గ్రామానికి చెందిన గొల్ల లలిత (50)గా గుర్తించారు. ఆమె ఇంటి నుంచి బయలుదేరి సంగారెడ్డి బస్టాండులో ఆర్టీసీ బస్సు ఎక్కినట్లు పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో తేలినట్లు సమాచారం. హంతకుల కోసం పలు కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సుభాష్ తెలిపారు.

బైకుతో డివైడర్‌ను ఢీకొని ఒకరి మృతి

పుల్‌కల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): చౌటకూర్ మండలం శివంపేట గ్రామ సమీపంలో మంగళవారం ద్విచక్రవాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టిన ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. రేగోడ్ మండలం జగిర్యాల గ్రామానికి చెందిన బేగరి లింగయ్య (40) టీఎస్07 జీఆర్6792 గల లూనాపై సంగారెడ్డికి ప్రయాణిస్తున్నారు. ఈ క్రమంలో శివంపేట సమీపంలో సంగారెడ్డి-నాందేడ్, అకోలా 161వ నంబరు జాతీయ రహదారి పై ఓవర్‌పై వాహనం అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో లింగయ్య కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని సంగారెడ్డి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పుల్కల్ ఎస్‌ఐ క్రాంతికుమార్ పాటిల్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

కారు బోల్తాపడి ...

కోహీర్, డిసెంబరు 3:(ఆంధ్రజ్యోతి) కారు అదుపుతప్పి బోల్తా పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని చింతల గట్టు గ్రామ శివారులో సోమవారం రాత్రి జరిగింది. కోహీర్ ఎస్‌ఐ గోపతి సతీష్ కథనం ప్రకారం పటాన్‌చెరు మండలం పాటి గ్రామానికి చెందిన సామ అశోక్ (51) తన స్నేహితులతో కలిసి కారులో జహీరాబాద్ నుంచి పటాన్‌చెరు వైపు వెళ్తుండగా కోహీర్ మండలంలోని చింతల ఘట్టు గ్రామ శివారులోని 65వ జాతీయ రహదారిపై కారు అదుపుతప్పి రోడ్డుకు మరోవైపు రావడంతో ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టింది. దీంతో కారు బోల్తాపడి అందులో ఉన్న సామ అశోక్ అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. కారులోని మరో వ్యక్తికి తీవ్ర గాయాలు కావడంతో ఆసుపత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్‌ఐ సతీష్ వివరించారు.

ప్రమాదవశాత్తు జారి పడి..

హవేళిఘణపూర్, డిసెంబరు3:(ఆంధ్రజ్యోతి); చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని ఔరంగాబాద్‌లో మంగళవారం చోటు చేసుకున్నది. పోలీసుల వివరాల ప్రకారం అవుసులపల్లి గ్రామానికి చెందిన సున్నం ఏషయ్య(46) చేపలు పట్టుకుని జీవించేవాడు. మంగళవారం ఔరంగాబాద్ శివారులోని చెరువులో చేపలు పట్టేందుకు వెళ్ల ప్రమాదవశాత్తు కాలు జారి కింద పడి స్పృహ కోల్పోయాడు. సహచరులు ఆటోలో మెదక్ ప్రభుత్వాసుపత్రికి తరలించేసరికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి భార్య లక్ష్మీ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ రాజు తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

మేడ్చల్ టు ముత్కేడ్

● రూ.2,300 కోట్లతో రైల్వే డబుల్ లైన్

● హైదరాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్ లోకేష్ విష్ణోయ్



అక్కన్నపేట రైల్వే స్టేషన్ ప్లాట్ ఫామ్‌ను పరిశీలిస్తున్న అధికారులు

రామయంపేట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మేడ్చల్ నుంచి ముత్కేడ్ వరకు రూ.2300 కోట్లతో రైల్వే డబుల్ లైన్ చేపడుతున్నట్లు హైదరాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్ లోకేష్ విష్ణోయ్ తెలిపారు. మంగళవారం ఆయనతో పాటు ఆరుగురు అధికారుల బృందం మెదక్ జిల్లా రామాయంపేట మండలం అక్కన్నపేట రైల్వే స్టేషన్‌ను సందర్శించి ప్లాట్‌ఫామ్, ఇతర సదుపాయాలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ కొత్తగా ఏర్పడ్డ మనోహరాబాద్ - కొత్తపల్లి వరకు నూతన విద్యుదీకరణ జరుగుతుందన్నారు. దీంతో ఇకముందు ఎలక్ట్రిక్ ఇంజన్లతో రైళ్లు ఫాస్ట్‌గా వెళ్లడంతో ప్రయాణికులకు సమయం ఆదా అవుతుందన్నారు. అలాగే అన్ని రైల్వే స్టేషన్లలోనూ అధునాతన సౌకర్యాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు

● నాణ్యత లేని తిను బండరాలు స్వాధీనం



నాణ్యతలేని తినుబండారాలను చూపుతున్న అధికారులు

మనోహరాబాద్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మనోహరాబాద్ మండలం కాళ్లకల్ గ్రామ శివారులోని ఓ తినుబండారాల తయారీ పరిశ్రమలో రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ, టాస్క్ ఫోర్స్ అధికారులు మంగళవారం తనిఖీలు చేశారు. జోనల్ అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ జ్యోతిర్మయి, టాస్క్ ఫోర్స్ ఫుడ్ ఎస్‌ఐ రోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ తనిఖీలలో పలు నాణ్యత లేని తినుబండారాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా జ్యోతిర్మయి మాట్లాడుతూ మార్కెట్‌లో అమ్మకానికి సిద్ధంగా ఉన్న సుమారు రూ.2.13లక్షలు విలువ చేసే నాణ్యత లేని, కల్తీ తినుబండారాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఆహారంలో రంగుల కోసం ప్రమాదకరమైన అజినోమోటో ఉప్పును వాడుతున్నారన్నారు. హానికరమైన మాసాలా పోడులను ధ్వంసం చేసినట్లు తెలిపారు. ఆహార నమూనాలను ప్రయోగశాలకు పంపించామన్నారు. చట్టానికి విరుద్ధంగా కొనసాగిస్తున్న ఈ పరిశ్రమకు నోటీసులు కూడా అందజేశామన్నారు. కార్యక్రమంలో అధికారులు స్వాతి, శ్రీశిక తదితరులు పాల్గొన్నారు

స్కూల్ బస్సు, ఆటో ఢీ

●విద్యార్థులకు తప్పిన పెను ప్రమాదం



ఎల్లాపూర్ వంతెనపై ఢీకొన్న స్కూల్ బస్సు, ఆటో

పాపన్నపేట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఓ ప్రైవేటు పాఠశాల బస్సు ట్రాలీ ఆటో ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో విద్యార్థులకు పెను ప్రమాదం తప్పింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మెదక్ పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలకు చెందిన బస్సు 30 మంది విద్యార్థులతో పాపన్నపేట వైపు వస్తుంది. అదే సమయంలో ఎల్లాపూర్ నుంచి ఫోర్‌వీలర్ ఆటో మెదక్ వైపునకు వెళ్లండగా ఎల్లాపూర్ గ్రామ శివారులోని మంజీరా నది వంతెన వద్దకు రాగానే ఆటో ముందర టైరు పగిలి అదుపు తప్పి ఎదురుగా వస్తున్న పాఠశాల బస్సును ఢీకొట్టింది. ప్రమాదాన్ని పసిగట్టి వెంటనే బ్రేకు వేయడంతో బస్సు డ్రైవర్ శంకర్‌గౌడ్‌తో పాటు ఆటో డ్రైవర్ సాయిలుకు తీవ్ర గాయాలుకాగా, కొంత మందిరికి స్వలప్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న మెదక్ రూరల్ సీఐ రాజశేఖర్‌రెడ్డి, పాపన్నపేట ఏఎస్‌ఐ సంగయ్య సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను 108 వాహనంలో జిల్లా ఆసుపత్రికి తరలించారు. తృటిలో పెను ప్రమాదం తప్పడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు.



ఆర్టీఏ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న ట్రావెల్ ఏజెన్సీ నిర్వాహకులు, ఏఐటీయూసీ నాయకులు



మహారాష్ట వాహనాన్ని అడ్డుకున్న స్థానికులు

ఒకే నంబరుతో రెండు వాహనాలు!

సంగారెడ్డి జిల్లాలో యథేచ్ఛగా ఇతర రాష్ట్రాల వాహనాల మాయ

ఒకే నంబరుతో తిరుగుతున్నా పట్టించుకోని ఆర్టీఏ అధికారులు

స్థానిక క్యాబ్‌లు, అద్దె వాహనాలకు తీవ్ర నష్టం

సంగారెడ్డి ఆర్టీఏ కార్యాలయం ఎదుట ట్రావెల్ ఏజెన్సీల ఆందోళన

సంగారెడ్డి జిల్లా కేంద్రంలో మహారాష్ట్రకు చెందిన ఒకే నంబరు(ఎంహెచ్ 23 పై 2771)తో రెండు వాహనాలు తిరుగుతున్నాయి. ఓన్ ప్లేట్ కలిగిన ఈ వాహనాలను నియంత్రించడంలో ఆర్టీఏ అధికారులు విఫలమయ్యారని ట్రావెల్ ఏజెన్సీ నిర్వాహకులు విమర్శిస్తున్నారు. వెంటనే ఆ వాహనాలను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు.

కంది, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఇతర రాష్ట్రాలకు చెందిన వాహనాలు యథేచ్ఛగా తిరుగుతున్నా ఆర్టీఏ అధికారులు పట్టించుకోవడం లేదని ఏఐటీయూసీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు ఎం.డి.మహబూబ్ ఆరోపించారు. ఒకే నంబరుతో రెండు వాహనాలు తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని ధ్వజమెత్తారు. కంది లోని ఆర్టీఏ కార్యాలయం ఎదుట మంగళవారం మహారాష్ట్ర ట్రావెల్ ఏజెన్సీకి చెందిన ఒక వాహనాన్ని అడ్డుకున్నారు. అనంతరం ఆర్టీఏ కార్యాలయం ఎదుట సంగారెడ్డికి చెందిన ట్రావెల్స్ ఏజెన్సీల నిర్వాహకులు ఆందోళన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన మహబూబ్ మాట్లాడుతూ మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన సొంత నంబరు గల వాహనాలను తెలంగాణాలో అనుమతించకూడదన్నారు. పలువురు రాజకీయ నాయకుల అండదండలతోనే ఈ దందా కొనసాగుతుందని ఆరోపించారు. వీరికి ఆర్టీఏ అధికారులు వత్తాసు పలుకుతున్నారన్నారు. ఇతర రాష్ట్రాలవారు ఎలాంటి పన్ను కట్టకుండా తెలంగాణాలో నడిపిస్తున్నారని, దీంతో పన్నులు చెల్లించి నడుపుతున్న స్థానిక వాహనదారులు గిరాకీలు లేక నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్టీఏ అధికారులు పర్యవేక్షణ కొరవడడంతో సెలవు దినాలు, రాత్రి సమయాలలో స్కూల్, కాలేజ్ బస్సులు అద్దెకిస్తూ ఇక్కడి ట్రావెల్ ఏజెన్సీ నిర్వాహకుల పొట్ట కొడుతున్నారన్నారు. వెంటనే ఇతర రాష్ట్రాల ఓన్ ప్లేట్ వానాలను తెలంగాణ రాష్ట్రంలో తిరగకుండా, స్కూల్, కాలేజీ బస్సులను అద్దెలకు ఇవ్వకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనియెడల జిల్లా వ్యాప్తంగా డ్రైవర్లతో కలెక్టరేట్ ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ట్రావెల్ ఏజెన్సీ నిర్వాహకులు ఎండీ జుబేర్, నాయకులు ముక్రమ్, ఆశిరెడ్డి, బాబన్న, అశోక్, ఖదీర్, పటేల్, దాస్ వెంకట్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

పట్టాలను తిరిగి గిరిజనులకే ఇవ్వాలి

●కలెక్టర్‌కు వినతి

రామచంద్రాపురం, డిసెంబరు 3 : సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురం పరిధిలోని వెలిమెలతండా శివారులోని 450 ఎకరాల్లో 1954వ సంవత్సరం నుంచి కొందరు గిరిజనులు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. 1979లో వీరికి 38-ఈ పట్టాలను అప్పటి ప్రభుత్వం జారీచేసింది. ఈ భూములు లాక్కోవాలని భావించిన కొందరు భూస్వాములు బ్యాంకు రుణాలు, పంటరుణాలు, అప్పులు ఇస్తున్నామంటూ గిరిజనుల నుంచి సంతకాలు తీసుకుని సదరు పట్టాలను లాక్కున్నారు. దీన్ని గుర్తించిన వెలిమెల మాజీ సర్పంచ్ రాజ్యం మహిపాల్‌గౌడ్ బాధితులకు న్యాయం చేసే విధంగా కృషి చేస్తున్నారు. ఈ విషయాన్ని పలుమార్లు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. మంగళవారం కూడా సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి వల్లూరుని కలిసి ఈ సమస్య వివరించారు. బాధిత గిరిజనులకు తిరిగి భూ పట్టాలను ఇప్పించాలని విన్నవించారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ఇథనాల్ ఫ్యాక్టరీతో భవిష్యత్తులో అనర్థాలు

● అఖిలపక్షం నాయకులు

బెజ్జంకి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): బెజ్జంకి మండలంలోని గుగ్గిళ్ల, నరసింహులపల్లి గ్రామ శివారులో నిర్మిస్తున్న ఇథనాల్ ఫ్యాక్టరీతో భవిష్యత్తులో అనర్థాలు తప్పవని అఖిలపక్షం నాయకులు అన్నారు. ఇథనాల్ ఫ్యాక్టరీని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలో సీపీఎం, సీపీఐ, బీఆర్‌ఎస్, బీజేపీ, బీఎస్పీ పార్టీల ఆధ్వర్యంలో మంగళవారం అఖిలపక్షం నాయకుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అఖిలపక్షం నాయకులు మాట్లాడుతూ.. గ్రామసభలు నిర్వహించకుండా దొడ్డి దారిన ఫ్యాక్టరీ నిర్మాణానికి అనుమతులు పొందారని ఆరోపించారు. నిర్మల్ జిల్లా దిలావర్పూర్‌లో ఇథనాల్ ఫ్యాక్టరీని ప్రభుత్వం రద్దు చేసిందని, ఇక్కడి ఫ్యాక్టరీని కూడా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేనియెడల అన్ని పార్టీల ఆధ్వర్యంలో క్షేత్రస్థాయి పర్యటనలు చేసి ఫ్యాక్టరీ రద్దయ్యేంతవరకు ప్రజలతో కలిసి పోరాటాలు చేస్తామని హెచ్చరించారు.

కక్షిదారులకు అవగాహన కల్పించాలి

● జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయి రమాదేవి



మాట్లాడుతున్న జిల్లా జడ్జి సాయిరమాదేవి

సిద్దిపేట క్రైం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 14వ తేదీన జిల్లాలో జాతీయ లోక్ అదాలత్ ఉంటుందని, కక్షిదారులకు అవగాహన కల్పించి రాజీపడే కేసులను పరిష్కరించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయి రమాదేవి న్యాయవాదులకు సూచించారు. సిద్దిపేట కోర్టులో బార్ అసోసియేషన్ న్యాయవాదులతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. జిల్లాలో క్రిమినల్, సివిల్, ఎక్సైజ్ కేసులు, మోటార్ వాహనాల కేసులు అధిక మొత్తంలో పెండింగ్‌లో ఉన్నాయని, ఈనెల 14న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో సివిల్ చెక్ బౌన్స్, మోటార్ వాహనాల కేసులలో రాజీ కుదిర్చి, అధిక మొత్తంలో కేసులు రాజీ పడేలా చూడాలని న్యాయవాదులకు సూచించారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీస్ అథారిటీ సెక్రెటరీ స్వాతిరెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జనర్ధన్‌రెడ్డి, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

మన ఊరు- మన బడి బిల్లులివ్వరా!

● ముందుకు సాగని పనులు
● ఏడాదిగా నిలిచిన నిధులు
● మెదక్ జిల్లాలో రూ.10 కోట్లు పెండింగ్
● బిల్లులు చెల్లించాలని కాంట్రాక్టర్లు, ఎస్‌ఎంసీ చైర్మన్ల ధర్నా
● ఏడుగురిపై కేసు నమోదు



ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో పిల్లర్లస్థాయిలో నిలిచిన డైనింగ్ హాల్ నిర్మాణ పనులు

మెదక్ అర్బన్, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ స్థాయి విద్య, సౌకర్యాలను కల్పించాలనే సంకల్పంతో గత సర్కార్ అమలు చేసిన 'మన ఊరు- మన బడి' పనులు ఆగిపోయాయి. దాంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్లు పనులు చేసేందుకు ముందుకు రావడం లేదు. ఈ కార్యక్రమం కింద మెదక్ జిల్లాలో తొలి విడతలో 180 ప్రాథమిక, 44 ప్రాథమికోన్నత, 89 ఉన్నత పాఠశాలలను ఎంపిక చేశారు. బడుల్లో పనులు చేపట్టేందుకు రూ.65.02 కోట్లతో అంచనాలు రూపొందించారు. పనుల పురోగతి ఆధారంగా నిధులు విడుదల చేయాలని నిర్ధేశించారు. 312 పాఠశాలల్లో పనులు ప్రారంభించారు. ఎంపిక చేసిన బడుల్లో అదనపు గదులు, మూత్రశాలలు, విద్యుత్ సరఫరా, వంట గది, తాగునీటి వసతి, ఫర్నీచర్, రంగులు, మరమ్మతులు, ఉన్నత పాఠశాలల్లో డైనింగ్ హాల్స్, డిజిటల్ తరగతుల నిర్వహణకు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు రూ.23.44 కోట్ల నిధులు మాత్రమే మంజూరయ్యాయి. ఇంకా బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో కాంట్రాక్టర్లు పనులు నిలిపివేశారు. ఈ విషయమై డీఈవో రాధాకిషన్ వివరణ కోరగా... మొదటి విడతలో చేపట్టిన పనులకు దాదాపు రూ.10 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు.

బిల్లుల కోసం ధర్నా..

'మన ఊరు- మన బడి' పనుల బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఉదయం పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ఎదుట ఎస్‌ఎంసీ చైర్మన్లు, కాంట్రాక్టర్లు ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా దశరథం, దుర్గసాయిలు, శ్రీనివాస్, లక్ష్మణ్, మాణిక్యం, భూపాల్, కృష్ణ మాట్లాడుతూ.. తాము పనులు చేపట్టి ఏడాది అవుతున్నా బిల్లులు రావడం లేదన్నారు. అప్పులు తెచ్చి పనులు చేశామని వాపోయారు. బిల్లుల రాకపోవడంతో పనులు నిలిపివేయాల్సి వచ్చిందన్నారు. ఈ విషయమై ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు కూడా చేశామన్నారు. దాదాపు రూ. కోటి బిల్లులు రావాల్సి ఉందన్నారు. వడ్డీలు కడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినట్లు వారు పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న హెచ్‌ఎం రేఖ వారికి నచ్చచెప్పే ప్రయత్నం చేసినప్పటికీ వినలేదు. డీఈవో వచ్చి చెప్పేంత వరకు కదిలే ప్రస్తకే లేదన్నారు. దాంతో హెచ్‌ఎం స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. ఎంఈవో నీలకంఠం అక్కడి చేరుకొని బిల్లుల విషయం కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని, త్వరలో సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. హెచ్‌ఎం రేఖ ఫిర్యాదుతో 7 మంది కాంట్రాక్టర్లు, ఎస్‌ఎంసీ చైర్మన్లపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ నాగరాజు తెలిపారు.

పెండింగ్ బిల్లులు ఇలా (రూ.లక్షల్లో..)

పనులు	పాఠశాలలు	అంచనా వ్యయం	మంజూరు	పెండింగ్
తరగతి గదులు	60	1,916.05	401.18	1,514.87
డైనింగ్ హాల్స్	95	1,345.45	439.79	905.66
తాగునీటి వసతి	308	407.16	167.18	239.98
విద్యుత్ సరఫరా	308	640.16	427.5	212.66
మరుగుదొడ్లు	21	177.91	15	162.91
ప్రహరీ	10	75.46	19.1	56.36
వంట గదులు	13	55.22	9	46.22
మరమ్మతులు	310	1,884,63	866.06	1,018.57

క్రైం కార్నర్

డిజిటల్ అరెస్టంటూ సైబర్ నేరగాళ్ల బెదిరింపులు

● పోలీసుల ప్రమేయంతో బయటపడిన వ్యక్తి

జహీరాబాద్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని మహీంద్రాకాలనీలో నివాసముంటున్న క్రిష్ణ స్థానిక అల్కాకర్మాగారంలో క్వాలిటీ కంట్రోల్ అధికారిగా పనిచేస్తున్నాడు. మంగళవారం ఉదయం ఆయనకు ముంబాయి ఎస్‌బీఐ బ్యాంకు ఉద్యోగినంటూ ఆకాష్ శర్మ అనే వ్యక్తి ఫోన్ చేసి బెదిరింపులకు పాల్పడ్డాడు. 'నీవు డిజిటల్ అరెస్టులో ఉన్నావని, ఎక్కడికి కదలడానికి వీలులేదని, వివరాలు చెప్పేటప్పుడు తమవద్ద ఆర్‌బీఐ అధికారులుంటారని, పూర్తి వివరాలను చెప్పేవరకు ఎక్కడున్నావో అక్కడే ఉండాలని' సైబర్ నేరగాడు క్రిష్ణకు తెలిపారు. అలాగే నీ బ్యాంకు ఖాతా నుంచి ముంబాయిలో రూ.1.68లక్షలు ఫ్రాడ్ జరిగిందని, ఈడీ పోలీసులు మిమ్మల్ని విచారిస్తారని చెప్పి కాల్ కట్ చేశాడు. అనంతరం వాట్సాప్‌కాల్ చేసి ముంబాయి నుంచి ఎస్పీ ప్రదీప్‌ను మాట్లాడుతున్నానంటూ అరగంట పాటు క్రిష్ణను ప్రశ్నిస్తూనే ఉన్నాడు. దీపై క్రిష్ణ భార్యకు అనుమానం వచ్చి నీళ్లు తాగి వస్తానని చెప్పి బయటకు వెళ్లి 100 నంబర్‌కు ఫోన్‌చేసి పూర్తిస్థాయి సమాచారం ఇవ్వడంతో వెంటనే స్పందించిన పట్టణ ఎస్‌ఐ కాశీనాథ్ సైబర్‌వారియార్ రషీద్‌తోపాటు ఆయన వెంట సిబ్బందిని మహీంద్రకాలనీలోని క్రిష్ణ ఇంటికి పంపించారు. ఇంట్లో పెద్దగ శబ్దం రావడంతోపాటు, పోలీసులు రావడంతో ధైర్యంతో బాధితుడు ఎదురు ప్రశ్నలు వేయసాగాడు. దీంతో సైబర్‌నేరగాడికి అనుమానం వచ్చి కాల్‌ను కట్‌చేశాడు. పోలీసులు రావడంతో సైబర్ నేరగాడి మోసం నుంచి తప్పించుకున్నట్లైంది. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ డిజిటల్ అరెస్టులు, విచారణల పేరుతో వచ్చే నకిలీ ఫోన్‌కాల్స్ వీడియోలను నమ్మొద్దన్నారు. ఏమాత్రం అనుమానం వచ్చిన డయల్ 100కు, జహీరాబాద్ పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఇలాంటి ఘటనలపై ప్రజలు అప్రమత్తంగ ఉండాలని సూచించారు.

సెల్‌టవర్ బ్యాటరీ దొంగల అరెస్ట్

● 23 బ్యాటరీలు, ఫోన్లు, వాహనాలు, నగదు స్వాధీనం

గజ్వేల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): సెల్‌టవర్ బ్యాటరీల దొంగలను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. దీనికి సబంధించి వివరాలను మంగళవారం గజ్వేల్ ఏసీపీ కె.పురుషోత్తంరెడ్డి వెల్లడించారు. మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా శామీర్‌పేట మండలం లాల్‌గడి మలక్‌పేట గ్రామానికి చెందిన బాదావత్ కృష్ణ(48) ప్రస్తుతం మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలోని రాబగంబల బస్తీలో, శామీర్‌పేట మండలం అలియాబాద్ చర్చికాలనీకి చెందిన బానోత్ సతీష్(20) మంచిర్యాల జిల్లా యెల్లక్కపేటలో, మంచిర్యాల జిల్లా నస్పూర్ ఆర్‌కే5 కాలనీకి చెందిన ఇస్లావత్ రమేశ్(36)మేడ్చల్-మల్కాజ్ గిరి జిల్లా అలియాబాద్‌లో, మంచిర్యాల జిల్లా బెల్లంపల్లికి చెందిన లావుడియా శంకర్(39) శామీర్‌పేట మండల కేంద్రంలోని పెద్దమ్మ కాలనీలో నివాసముంటున్నారు. వీరితోపాటు మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా మేడ్చల్‌కు చెందిన దుద్దెడ శంకర్(47), ఓ మైనర్ యువకుడు కలిసి సెల్‌టవర్ల వద్ద బ్యాటరీల చోరీకి పాల్పడుతున్నారు. గజ్వేల్, కుకునూరుపల్లి, ములుగు, మనోహరాబాద్, షామీర్‌పేట, శివంపేట, శంషాబాద్, చేగుంట పోలీస్‌స్టేషన్ల పరిధిలోని పలు సెల్‌టవర్ల బ్యాటరీలను దొంగిలించి తుర్కపల్లి వద్ద దుద్దెడ లింగంకు విక్రయించారు. ఈ కేసుల దర్యాప్తు చేపట్టిన పోలీసులు టెక్నాలజీని ఉపయోగించి నిందితులను అరెస్ట్ చేసి వారి నుంచి 23 సెల్‌టవర్ బ్యాటరీలు, 4 సెల్‌ఫోన్లు, ఓ మోటార్‌సైకిల్, రెండు ఆటోలు, రూ.98వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసు ఛేదనలో చాకచక్యంగా వ్యవహరించిన పోలీస్ సిబ్బందిని సిద్దిపేట సీపీ బి.అనురాధ అభినందించారని, త్వరలోనే రివార్డును అందజేయనున్నట్లు తెలిపారు.

చేర్యాలలో ఇద్దరు దొంగలు..



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌ఐ నీరేశ్

చేర్యాల, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల మండలం కడవేరుగు గ్రామంలోని కనకదుర్గమాతా ఆలయంలో కొన్ని రోజులక్రితం చోరీకి పాల్పడిన ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ నీరేశ్ తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. పెద్దపల్లి జిల్లా హనుమంతులపేట గ్రామానికి చెందిన త్రిదండిపని అనిల్, పైడి అజయ్ దొంగతనాలు చేయడమే వృత్తిగా అలవర్చుకున్నారు. ఇటీవల మండలంలోని కడవేరుగు కనకదుర్గమాత ఆలయంలో విగ్రహానికి అలంకరించిన ఆభరణాలతో పాటు హుండీని ధ్వంసంచేసి నగదు అపహరించుకుపోయారు. ఈ విషయమై దర్యాప్తు చేపట్టిన పోలీసులు వేలిముద్రల ఆధారంగా నిందితులను గుర్తించి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వారి నుంచి రూ.14వేల నగదు రికవరీ చేశారు. వీరిపై గతంలో పెద్దపల్లి, జగిత్యాలలో కేసులు నమోదయ్యాయి.

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి



ఘటనా స్థలంలో వడ్ల రమేష్ మృత దేహం

చేగుంట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : చేగుంట నుంచి స్వగ్రామం వల్లూర్‌కు సైకిల్‌పై వెళ్తున్న వ్యక్తిని ఆర్టీసీ బస్సు ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. నార్సింగి ఎస్సై అహ్మద్ మొహినోద్దిన్, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం నార్సింగి మండల పరిదిలోని వల్లూర్ గ్రామానికి చెందిన వడ్ల రమేష్ (40) మంగళవారం రాత్రి చేగుంట మండల కేంద్రంలో పనులు ముగించుకుని తన సైకిల్ పై వల్లూర్‌కు వెళ్తున్నాడు. నిజామాబాద్ వైపు నుంచి హైదారాబాద్ వెళ్తున్న నిజామాబాద్ డిపోకు చెందిన ఆర్టీసీ రాజధాని డీలక్స్ బస్సు అతివేగంగా అతడిని ఢీకొట్టడతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య లత, కొడుకు వంశీ ఉన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం రామాయంపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

హత్య కేసులో ఐదుగురి అరెస్టు

తూప్రాన్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): గొడవలో జరిగిన దాడిలో తీవ్ర గాయపడి వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందిన ఘటనలో ఐదుగురి నిందితులను మంగళవారం అరెస్టు చేశారు. ఈ సంఘటన తూప్రాన్ మండలం నర్సంపల్లి శివారులోని మద్దులతండాలో చోటు చేసుకుంది. తూప్రాన్ ఎస్‌ఐ శివానందం కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. తూప్రాన్ మండలం నర్సంపల్లి శివారులో మద్దులతండాలో సెప్టెంబరు 7న నాగార్జున (36), ధన్‌సింగ్ కుటుంబానికి గొడవ జరిగింది. గొడవలో ధన్‌సింగ్ కుటుంబీకులు చేసిన దాడిలో నాగార్జున గాయపడ్డాడు. 9న ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. తీవ్రంగా గాయపడిన నాగార్జున చికిత్స పొందుతూ నవంబర్ 2న మృతిచెందాడు. ఈ ఘటనలో పోలీసులు హత్య కింద కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు. హత్యకు కారణమైన ధన్‌సింగ్, మీనా, హరిలాల్, రమేష్, శోభలను మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ శివానందం తెలిపారు.

ఆరు నెలలకే దెబ్బతిన్న ఆర్వోబీ



రోడ్డుపై గుంతలు

కుకునూరుపల్లి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కోట్లు వెచ్చించి నిర్మించిన రోడ్డు ఆరు నెలలు గడవకముందే దెబ్బతిన్నది. కుకునూరుపల్లి శివారులో పోలీస్‌స్టేషన్ వద్ద రోడ్ ఓవర్ బ్రిడ్జిని నిర్మించారు. మనోహరాబాద్ నుంచి కొత్తపల్లికి రైల్వే లైన్ మంజూరు కాగా సిద్దిపేట వరకు రైల్వేలైన్ పూర్తి అయింది. కుకునూరుపల్లి పోలీస్‌స్టేషన్ వద్ద స్టీల్ బ్రిడ్జితో దాదాపు 20 కోట్లు వెచ్చించి ఆర్వోబీ నిర్మాణం చేపట్టారు. రోడ్డు ప్రారంభించి ఆరు నెలలు కూడా పూర్తి కాకముందే పగుళ్లు వచ్చి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

నత్తనడకన హైలెవల్ బ్రిడ్జి పనులు

- రెండేళ్లు గడుస్తున్నా పూర్తి కాని వైనం
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

చిన్నకోడూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): చిన్నకోడూరు మండలం సికింద్లాపూర్, నంగునూరు మండలం దర్గపల్లి గ్రామాల మధ్య వాగుపై హై లెవల్ బ్రిడ్జి నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. సంవత్సరాలు గడుస్తున్నా పనులు పూర్తి కాకపోవడంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బ్రిడ్జి నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నా అధికారులు, పాలకులు దృష్టి సారించడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

రూ.7 కోట్ల 15 లక్షలతో పనులు

సికింద్లాపూర్ నుంచి దర్గపల్లికి వెళ్లే రోడ్డులో వాగుపై హై లెవల్ బ్రిడ్జి నిర్మాణానికి రూ.7 కోట్ల 15 లక్షలతో రెండు సంవత్సరాల క్రితం పనులు ప్రారంభించారు. బ్రిడ్జి పక్కన వాగులో తాత్కాలికంగా మట్టి రోడ్డు వేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు వాగు ఉధృతి పెరగడంతో అధికారులు రెండు గ్రామాలకు రాకపోకలు నిలిపివేశారు. వర్షాలు కురిసినప్పుడు ఆయా గ్రామాల ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.



సికింద్లాపూర్-దర్గపల్లి గ్రామాల నడుమ బ్రిడ్జి

పెండింగ్‌లో 40 శాతం పనులు

సుమారు 60 శాతం పనులు పూర్తి కాగా ఇంకా 40 శాతం పనులు మిగిలి ఉన్నాయి. పనులను త్వరితగతిన పూర్తి చేసి బ్రిడ్జిని అందుబాటులోకి తీసుకువచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.



ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వాగు పొంగడంతో రాకపోకలను నిలిపివేసిన పోలీసులు(ఫైల్)

'హామీల అమలులో ప్రభుత్వం విఫలం'



నంగనూరు: మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

నంగునూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ జడ్పీ వైస్‌చైర్మన్ రాగుల సారయ్య , మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్‌రెడ్డి, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు అనగోని లింగం గౌడ్, మాజీ ఏఎంసీ చైర్మన్ సోంరెడ్డిలు ఆరోపించారు. మండలంలోని పాలమాకులలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గ్రామాల్లో పారిశుధ్య చర్యలు చేపట్టడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. మాయ మాటలతో రైతులను మోసం చేస్తున్నారన్నారు. సమావేశంలో పాలమాకుల మాజీ సర్పంచ్ పంగ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

● బెజ్జంకి(ఆంధ్రజ్యోతి): అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ వాటిని నెరవేర్చలేక హామీలకు పంగనామాలు పెడుతున్నదని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాకాల మహిపాల్‌రెడ్డి ఆరోపించారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు రైతులపై ఎనలేని ప్రేమ చూపిన కాంగ్రెస్‌ది కపట ప్రేమేనన్నారు. ఎన్నికల ముందు ధాన్యానికి బోనస్ ఇస్తామని చెప్పి ఇప్పుడు కేవలం సన్నాలకు మాత్రమే బోనస్ ఇస్తూ రైతులను మోసం చేసిందన్నారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మణ్, తిరుపతి, లక్ష్మారెడ్డి, సుదర్శన్, కిష్టయ్య, మహేందర్, మోహన్, శ్రీనివాస్, రవి తదితరులు పాల్గొన్నారు.

'పేదలకు ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలి'



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ పారిజాత

గజ్వేల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పేదలకు ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని హైదరాబాద్ బడంగ్‌పేట్ కార్పొరేషన్ మేయర్, గజ్వేల్ నియోజకవర్గ ఇందిరమ్మ కమిటీ కోఆర్డినేటర్ పారిజాత అన్నారు. గజ్వేల్ పట్టణంలో మంగళవారం నిర్వహించిన ఇందిరమ్మ కమిటీల సమన్వయం, అవగాహన సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్రం ఇచ్చిన సోనియాగాంధీ రుణం తీర్చుకోవాలంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలన్నారు. నిజమైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లను అందించాలని, రేషన్ కార్డులు, ప్రభుత్వ పథకాలను అందజేయాలని సూచించారు. ఆమెవెంట మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి, గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్, మాజీ చైర్మన్ భాస్కర్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీకాంతాచారి త్యాగం వెలకట్టలేనిది

● వర్థంతిలో నాయకులు

గజ్వేల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): తెలంగాణ మలి దశ ఉద్యమంలో ప్రాణాలను వదిలిన అమరుడు శ్రీకాంతాచారి త్యాగం వెలకట్టలేనిదని ఎమ్మెల్సీ వంటేరి యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి అన్నారు. శ్రీకాంతాచారి వర్థంతి సందర్భంగా గజ్వేల్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

శ్రీకాంతాచారి వర్థంతి సందర్భంగా గజ్వేల్ పట్టణంలోని మార్కెట్ రోడ్డులో ఆయన విగ్రహ ఏర్పాటుకు విశ్వబ్రాహ్మణ సంఘ నాయకులు భూమి పూజ చేశారు.

● కోహెడ: మండల కేంద్రంలో మంగళవారం బీసీ నాయకులు పిడిశెట్టి రాజు, మాజీ ఎంపీటీసీ తిప్పారపు నాగరాజు ఆధ్వర్యంలో శ్రీకాంత్‌చారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

● కొండపాక: తెలంగాణ సాధన కోసం ప్రాణాలు అర్పించిన కాసోజు శ్రీకాంతాచారి వర్థంతిని కొండపాకలో మంగళవారం జరిపారు. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

● దుబ్బాక: శ్రీకాంతచారి వర్థంతిని దుబ్బాక విశ్వకర్మ భవనంలో నిర్వహించారు.



గజ్వేల్: పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శ్రీకాంతాచారి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

కొనసాగుతున్న ప్రజా పాలన విజయోత్సవాలు

గజ్వేల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో ప్రజాపాలన విజయోత్సవాలను మంగళవారం మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నరసయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ విజయోత్సవాల్లో మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డితో పాటు గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్ పాల్గొన్నారు.

● వర్గల్: మండలంలోని నాచారం నాచగిరి లక్ష్మీ నృసింహస్వామి క్షేత్రంలో రాష్ట్ర ప్రభుత్వం దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఆలయం వద్ద ప్రజాపాలన - ప్రజా విజయోత్సవాలలో భాగంగా శ్రీహనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. పారాయణ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్ అన్నపూర్ణతో పాటు ఆలయ అర్చకులు, అధికారులు పాల్గొన్నారు.



హుస్నాబాద్ టౌన్: ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజాప్రతినిధులు

● హుస్నాబాద్ టౌన్: ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా హుస్నాబాద్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో అర్బన్ డే ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత ఆధ్వర్యంలో ప్రజాపాలన విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఇందులో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి ఉన్నారు.

●దుబ్బాక: ప్రజాపాలన విజయోత్సవాల సందర్భంగా దుబ్బాక మున్సిపల్ కమిషనర్ రమేష్‌కుమార్ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు.

'ఆశా'ల సమస్యలు పరిష్కరించాలి

● సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు



తిగుల్ పీహెచ్‌సీలో వైద్యాధికారికి వినతిపత్రం అందజేస్తున్న కృష్ణమూర్తి, ఆశా వర్కర్లు

జగదేవ్‌పూర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): తిగుల్ పీహెచ్‌సీ, జగదేవ్‌పూర్ పీహెచ్‌సీ పరిధిలో పనిచేస్తున్న ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు మరాఠీ కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. ఆశావర్కర్లతో కలిసి తిగుల్ పీహెచ్‌సీ, జగదేవ్‌పూర్ పీహెచ్‌సీ వైద్యాధికారులు రాజశేఖర్, సత్యప్రకాష్‌లకు మంగళవారం వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పల్స్ పోలియో పెండింగ్ డబ్బులు చెల్లించాలని, ఆశావర్కర్లకు కనీసం వేతనం 18000 ఇవ్వాలన్నారు. 2024లో చేసిన పల్స్ పోలియో డబ్బులు రాష్ట్ర ప్రభుత్వం నేటికీ ఆశాలకు చెల్లించలేదన్నారు కార్యక్రమంలో జగదేవ్‌పూర్ మండలంలోని ఆశా వర్కర్ల యూనియన్ నాయకులు మాధవి, కవిత, నిర్మల, అనురాధ, పద్మావతి, ఉమారాణి, బాలమణి, కవిత, ప్రియాంక, మమత, సంతోష, వసంత, సలీం తదితరులు పాల్గొన్నారు.

టాలెంట్ టెస్ట్‌లో నాగపురి విద్యార్థుల ప్రతిభ

చేర్యాల, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గణితశాస్త్ర ఉపాధ్యాయుల ఫోరం ఆధ్వర్యంలో చేర్యాలలో మంగళవారం నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌లో మండలంలోని నాగపురి జడ్పీఎస్ఎస్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా పదోతరగతి విద్యార్థి మడిపడిగ నందకిషోర్ తెలుగు మాధ్యమంలో ప్రథమస్థానంలో నిలిచాడు. ఈ మేరకు ప్రధానోపాధ్యాయుడు ఎలికట్టె అయిలయ్య, ఉపాధ్యాయులు నందకిషోర్‌ను అభినందించారు.

మల్లన్న ఆలయంలో అవినీతిపై విచారణ చేపట్టాలి: రవీందర్

చేర్యాల, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మల్లన్న ఆలయంలో అవినీతిపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని సీపీఎం మండల కార్యదర్శి తాడూరు రవీందర్ అన్నారు. సీపీఎం నాయకుల బృందం మల్లన్న ఆలయాధికారులకు మంగళవారం వినతిపత్రం అందించిన అనంతరం మాట్లాడారు. భక్తుల మొక్కుబడులు, ఆలయ ఫైళ్లు మాయమవడంతో పాటు లడ్డూ, పులిహోర ప్రసాదాల్లో పురుగులు, తలవెంట్రుకలు వస్తున్నా ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం తగదన్నారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణారెడ్డి, తేలు ఇస్తారి, బక్కల్లి బాలకిషన్, సార్లయాదయ్య, సాయిలు, రవి పాల్గొన్నారు.

బెదిరిస్తున్న వారిపై కేసు నమోదు చేయాలి

● డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్

కుకునూరుపల్లి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): దళితులపై దాడి చేసిన కేసులో బాధితులను, సాక్షులను కేసు ఉపసంహరించుకోవాలని బెదిరిస్తున్న వారిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్ డిమాండ్ చేశారు. నిందితులపై చర్యలు తీసుకోవాలని సిద్దిపేట సీపీ, కుకునూరుపల్లి ఎస్ఐకి బాధితులు, సాక్షులతో కలిసి మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ.. 2021లో ముద్దాపూర్‌లో దసరా వేడుకల్లో దళితులపై దాడి చేసిన ఘటనలో 19మందిపై కేసు నమోదు అయిందని, ప్రస్తుతం కేసు సంగారెడ్డి ఎస్సీ ఎస్టీ ప్రత్యేక కోర్టులో ట్రయల్‌లో ఉందన్నారు. ఆ కేసును ఉపసంహరించుకోవాలని బాధితులను, సాక్షులను బెదిరిస్తూ పలువురు భయాందోళనకు గురిచేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పులి కల్పన, జిల్లా కార్యదర్శి బ్యాగరి వేణు, ఉపాధ్యక్షుడు భీమ్ శేఖర్, బాధితులు రాజవ్వ, పెద్ద నరసవ్వ, సాక్షులు ప్రతాప్, అనురాధ, స్వప్న, కిషన్ తదితరులు పాల్గొన్నారు.



సిద్దిపేట పోలీస్ కమిషనర్‌ను కలిసిన అనంతరం మాట్లాడుతున్న బాధితులు

ఎస్జీటీలకు ఎమ్మెల్సీ ఓటుహక్కు కల్పించాలి

● ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

జగదేవ్‌పూర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలో పనిచేసే ఎస్జీటీ ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటుహక్కు కల్పించాలని ఎస్జీటీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కరివేద మహిపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని దౌలాపూర్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉపాధ్యాయులందరికీ ఓటుహక్కు కల్పించాలని కోరారు. ప్రాథమిక పాఠశాలల్లోని ప్రతి తరగతికి ఒక గది, ఒక ఉపాధ్యాయుడు, ప్రతీ పాఠశాలకు ప్రధానోపాధ్యాయులను నియమించాలన్నారు. ఆయనవెంట కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సంకినేని మధుసూదన్‌రావు, రాష్ట్ర గౌరవ సలహాదారు పద్మారెడ్డి, ఎస్జీటీ యూనియన్ సిద్దిపేట జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శ్రీరాం శ్రీనివాస్, శ్రీధర్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్, మల్లికార్జున్ తదితరులున్నారు.



మాట్లాడుతున్న మహిపాల్‌రెడ్డి

మచ్చలేని నాయకుడు హరీశ్‌రావు

● సిద్దిపేట బీఆర్ఎస్ నాయకులు

సిద్దిపేట టౌన్, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): మచ్చలేని నాయకుడు హరీశ్‌రావుపై నిరాధార ఆరోపణలు చేసే ముందు చక్రధర్‌గౌడ్ తన నేర చరిత్ర గురించి ఒకసారి వెనక్కి తిరిగి చూసుకోవాలని సిద్దిపేట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పాల సాయిరాం, నంగునూరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎడ్ల సోమిరెడ్డి, నాయకులు ఎల్లారెడ్డి, శ్రీకాంత్‌గౌడ్‌లు మండిపడ్డారు. సిద్దిపేట పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం వారు మాట్లాడుతూ.. ఎప్పుడు ఏ పార్టీలో ఉంటాడో తెలియని చక్రధర్‌కు హరీశ్‌రావు గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. నేర చరిత్ర కలిగిన వారిని కాంగ్రెస్‌లో చేర్చుకోవడమే ఆ పార్టీ నాయకులు పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా ఒక్క నామినేటే పోస్టు కూడా సిద్దిపేటకు ఇవ్వలేదని, హరీశ్‌రావుపై అసత్య ఆరోపణలు, అబద్ధాలు మాట్లాడిన వారికి ఇస్తారనడంతో తమకు పోటీ పెట్టినట్లుగా కాంగ్రెస్ నాయకులు సిద్దిపేటలో వ్యవహరిస్తున్నారని ఎద్దేవా చేశారు. మాటిమాటికి సిద్దిపేట పేరు తీసే చక్రధర్‌గౌడ్ సిద్దిపేటపై ప్రేమ ఉంటే సిద్దిపేట నుంచి తరలించుకుపోయినా వెటర్నరీ కళాశాలను తిరిగి తీసుకురావాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు మెరుగు మహేష్, లింగం, నరేశ్‌గౌడ్, నాగుల ప్రశాంత్‌గౌడ్, రమేష్ తదితరులున్నారు.



మాట్లాడుతున్న నాయకులు

పోలింగ్ కేంద్రాల పరిశీలన



కొత్తూరులో కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో

ములుగు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జరగబోయే గ్రామపంచాయతీ ఎన్నికల కోసం పోలింగ్ కేంద్రాలను సందర్శించినట్లు ములుగు ఇన్‌చార్జి ఎంపీడీవో నరసింహారావు తెలిపారు. మండల పరిధిలోని బండమైలారం, కొత్తూరు, బండతిమ్మాపూర్, కొక్కొండ, సింగన్నగూడ, బస్వాపూర్, దాసర్లపల్లి, శ్రీరాంపూర్, తునికి బొల్లారం, చిన్నతిమ్మాయిపల్లి, లక్ష్మక్కపల్లి గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను మంగళవారం పరిశీలించారు. ఆయనవెంట ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులతో పాటు కారోబార్లు ఉన్నారు.

సీపీఎం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి: ఎల్లయ్య

గజ్వేల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): వచ్చే నెలలో సంగారెడ్డిలో నిర్వహించనున్న సీపీఎం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సందబోయిన ఎల్లయ్య పిలుపునిచ్చారు. గజ్వేల్ పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గజ్వేల్ పట్టణంలో రెండు రోజులు నిర్వహించిన సీపీఎం సిద్దిపేట జిల్లా మూడవ మహాసభలను జయప్రదం చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో వచ్చే నెల నిర్వహించే రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఆయనవెంట సీపీఎం సిద్దిపేట జిల్లా నాయకులు బండ్ల స్వామి, మండల కార్యదర్శి రంగారెడ్డి, వెంకటాచారి తదితరులున్నారు.

సిద్దిపేటలో జనవరి 11న బాడీబిల్డింగ్ పోటీలు, ఎంపికలు

సిద్దిపేట కల్చరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి బాడీబిల్డింగ్ పోటీలు, ఎంపికలు వచ్చే నెల జనవరి 11న నిర్వహిస్తున్నట్లు సిద్దిపేట జిల్లా బాడీబిల్డింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు కొండం సంపత్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఏరువా అశోక్ మంగళవారం తెలిపారు. పట్టణంలోని విపంచి కళానిలయంలో నిర్వహించే ఈ పోటీల్లో 50 నుంచి 55, 60 నుంచి 65, 65 నుంచి 70, 80 నుంచి 85 బరువు విభాగాల్లో పోటీలు జరుగుతాయని చెప్పారు. మిస్టర్ సిద్దిపేటగా గెలిచిన బాడీ బిల్డర్‌కు ప్రైజ్ మనీ బహుమతిగా ఇవ్వనున్నట్లు చెప్పారు. సమావేశంలో బాలగోని సత్యం గౌడ్, సిద్దులు, శేఖర్, శౌకత్ అప్సర్, వెంకటస్వామి పాల్గొన్నారు.

మత్తులో మునిగి జీవితాలను నాశనం చేసుకోవద్దు: సీఐ లతీఫ్



మాట్లాడుతున్న సీఐ లతీఫ్

తొగుట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మత్తులో మునిగి యువత జీవితాలను నాశనం చేసుకోవద్దని తొగుట సీఐ లతీఫ్ సూచించారు. మండలంలోని వెంకట్రావ్‌పేట ప్రభుత్వ పాఠశాలలో సైబర్ నేరాలపై విద్యార్థులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థి దశ చాలా కీలకమని, ఇపుడే ప్రణాళికలు తయారు చేసుకుని ముందుకు సాగాలన్నారు. నూతన చట్టాలతో మహిళల రక్షణకు పెద్దపీట వేశామన్నారు. కార్యక్రమంలో తొగుట ఎస్ఐ రవికాంత్‌రావు, పాఠశాల ప్రిన్సిపాల్ నహిమా కౌజర్, గజ్వేల్ షీటీమ్ ఏఎస్ఐ శ్రీరాములు, మహిళా కానిస్టేబుల్ శ్యామల, కానిస్టేబుల్ రామచంద్రారెడ్డి పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వన్యప్రాణులను సంరక్షించుకోవాలి

● ఫారెస్ట్‌బీట్ అధికారి రాముడు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఫారెస్ట్‌బీట్ అధికారి రాముడు

చేర్యాల, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వన్యప్రాణులు అంతరించిపోకుండా సంరక్షించుకోవాలని ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ వై.రాముడు అన్నారు. చేర్యాల మండలం నాగపురి జడ్పీఎస్ఎస్‌లో మంగళవారం జంతువుల సంరక్షణ-అడవుల రక్షణ అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అడవుల సంరక్షణతో వన్యప్రాణులు సురక్షితంగా ఉండటంతో పాటు వాతావరణ సమతుల్యంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు అయిలయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మున్సిపల్ పారిశుధ్య సిబ్బందికి వైద్యపరీక్షలు

చేర్యాల, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): చేర్యాల మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి వైద్యబృందం పారిశుధ్య నిర్వహణ సిబ్బందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో కమిషనర్ నాగేందర్, కౌన్సిలర్ ఆడెపు నరేందర్, మేనేజర్ ప్రభాకర్, సీనియర్ అసిస్టెంట్ కృష్ణ, వార్డు ఆఫీసర్లు పాల్గొన్నారు.

శిశువుకు అరుదైన శస్త్రచికిత్స

సిద్దిపేట టౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట పట్టణంలోని సిరి పిల్లల ఆసుపత్రిలో మంగళవారం ఓ శిశువుకు అరుదైన శస్త్రచికిత్స చేసినట్లు ఆసుపత్రి వైద్యులు విక్రమ్, సాయిరాం, రమేష్ నాయక్‌లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నెలలు నిండని 1కిలో 400 గ్రాముల బరువున్న ఓ శిశువుకు డుయోడెనాల్ ఆట్రేసియా అనే పిడియాట్రిక్ అనే అత్యంత సంక్లిష్టమైన శస్త్రచికిత్స చేశామని చెప్పారు. నెలలు నిండకముందే పుట్టడంతో ఇలాంటి పిల్లలకు సర్జరీ చేయడం చాలా కష్టమని, కానీ తమ వైద్య బృందం ఎంతో శ్రమించి ఈ సర్జరీ నిర్వహించిందని తెలిపారు. వారివెంట ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ ఇమ్రాన్, సిబ్బంది ఉన్నారు.



శస్త్రచికిత్స చేసిన శిశువుతో వైద్యులు

వణికిస్తున్న వరుణుడు

5వ పేజీ తరువాయి

కాపాడుకునేందుకు టార్పాలిన్ కవర్లు కప్పి ఉంచారు. త్వరగా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతులు అధికారులను కోరుతున్నారు.

కాంటా పెట్టే సమయానికి వానొచ్చింది



రెండు ట్రాక్టర్ల వడ్లు తీసుకొచ్చాను. నాలుగు రోజులు మార్కెట్‌లోనే ఆరబెట్టాను. వడ్లు కాంటా పెట్టే సమయానికి వాన పడింది. వర్షానికి వడ్లన్నీ నానిపోయాయి. ధాన్యాన్ని ఆరబెడుతున్నాం. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి మమ్మల్ని ఆదుకోవాలి

- సుగుణ, నర్సాపూర్

వానకు వడ్లు కొట్టుకుపోయాయి

నాలుగు రోజుల క్రితం సిద్దిపేట మార్కెట్ యార్డుకు వడ్లు తెచ్చాను. వడ్ల సరిగా ఎండలేదని మరో రెండు రోజులు మార్కెట్లోనే ఆరబెట్టాను. ఒకేసారి వర్షం రావడంతో ధాన్యమంతా తడిసి కొట్టుకుపోయింది. ధాన్యాన్ని కొనుగోలు చేయాలి.

- యాదగిరి, బూరుగుపల్లి

చివరి గింజవరకు వరకు కొనుగోలు చేస్తాం



జిల్లాలో ఇప్పటివరకు రెండు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశాం. ఇంకా జిల్లాలో అక్కడక్కడ వరి కోతలు అవ్వలేదు. రైతులు ఆందోళన చెందొద్దు. చివరి గింజ వరకు కొనుగోలు చేస్తాం.

- ప్రవీణ్ కుమార్, సివిల్ సప్లయ్ డీఎం

దివ్యాంగుల హక్కులను గౌరవించాలి

జగదేవ్‌పూర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల హక్కులను గౌరవించాలని మండల విద్యాధికారి మాధవరెడ్డి అన్నారు. మండల వనరుల కేంద్రం ఆవరణలో మంగళవారం దివ్యాంగుల దినోత్సవ నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ ప్రాంతాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు సైదులు, ఉపాధ్యాయులు విజయలక్ష్మి, సునిత, రేఖ, రిసోర్స్ పర్సన్స్ బాలయ్య, కరుణాకర్, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

● కుకునూరుపల్లి (ఆంధ్రజ్యోతి): కుకునూరుపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. దివ్యాంగ విద్యార్థులకు క్రీడలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో బచ్చల సత్తయ్య, ఎమ్మార్వో మల్లికార్జున్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం క్రీడల్లో గెలుపొందిన వారికి బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో భాస్కర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● మర్కుక్: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి సిద్దిపేట జిల్లా ఐఈ కోఆర్డినేటర్ రంగనాథ్‌తో కలిసి మండల విద్యాధికారి వెంకట్ రాములు హాజరయ్యారు. అనంతరం దివ్యాంగులకు క్రీడా పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటేశం, పీఆర్టీయూ మండల అధ్యక్షుడు శ్రీనివాసరావు, స్పెషల్ ఎడ్యుకేటర్ రమ్య తదితరులున్నారు.



మర్కుక్: మాట్లాడుతున్న రంగనాథ్